

ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

రాష్ట్రస్థాయి సీనియర్స్ అథ్లెటిక్ టోర్నీలో మహిళలు, పురుషుల విభాగాల్లో జిల్లా జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. 10లో



స్వామి సన్నిధిలో పండుగ

సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలోని వేంకటేశ్వరస్వామి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 42° / 27°

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరిగి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్: వచ్చే ఏడాది(2024) పద్మ అవార్డుల కోసం కేంద్రప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని డీవైఎస్‌ఓ ఎం.పరంధామ రెడ్డి తెలిపారు. విశిష్ట సామాజిక సేవలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టిన యువత, సంస్థల బాధ్యులు ప్రతిపాదనలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈమేరకు మూడు సెట్ల దరఖాస్తులను పంపించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం www. padmaawards. gov. in వెబ్‌సైట్‌లో లేదా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి మధిరకు విద్యుత్



సరఫరాను ప్రారంభించిన సీఈ శ్రీరాం, అధికారులు

మధిర: మధిరలోని 132 కేవీ సబ్ స్టేషన్ పరిధి మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు ఇకనుంచి నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటుందని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీరాంకుమార్ తెలిపారు. మధిరలోని సబ్‌స్టేషన్‌కు పెద్దగోపతి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాటుచేసిన లైన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటివరకు ఆంధ్రా ప్రాంతంలోని చిల్లకల్ నుంచి మధిరకు విద్యుత్ సరఫరా అవుతుండగా, ఖమ్మం సమీపాన ఏర్పాటుచేసిన పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యేలా మార్పు చేసినట్లు తెలిపారు. తద్వారా అంతరాయాలు తగ్గిపోయి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో ఎస్‌ఈలు సురేందర్, బి.శ్రీనివాస్, డీఈలు కృష్ణ, కృష్ణారావు, రామకృష్ణ, అంజయ్య దాస్, ఏడీఈలు అనురాధ, ఏడీఈ గురవయ్య, ఏఈలు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు బీజేపీ 'నిరుద్యోగ మార్చ్'

హాజరుకానున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మోహన్‌రావు

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా కేంద్రంలో శనివారం నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, నాయకులు శుక్రవారం పరిశీలించి జిల్లా కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించడమే కాక నిరుద్యోగులకు పరిహారం చెల్లించి ఉచిత శిక్షణ ఇప్పించాలనే డిమాండ్లతో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొననున్న ఈ మార్చ్ శనివారం సాయంత్రం 5గంటలకు జెడ్పీ సెంటర్ వద్ద మొదలై వైరా రోడ్డు, పాత బస్టాండ్ వరకు సాగనుండగా, అక్కడ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు ఎన్‌వీఎస్ఎస్.ప్రభాకర్, మందా సరస్వతి, సంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశపరీక్ష ఫలితాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఐదు నెలల పాటు ఫౌండేషన్ కోర్సుకు అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలవుతాయని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్, సెక్రటరీ కె.సత్యనారాయణ, డైరెక్టర్ సీహెచ్.వీరభద్రం తెలిపారు. ఈ ఫలితాలను www. tsscstudycircle. co. in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీల్లో శిక్షణ కోసం ఈనెల 21న ప్రవేశపరీక్ష నిర్వహించగా, 239 మంది హాజరైనట్లు తెలిపారు. మొదటి జాబితాలో ఎంపికయ్యే అభ్యర్థులు ఈనెల 29 నుంచి 31 వరకు ఖమ్మంలోని స్టడీ సర్కిల్‌లో నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని, వివరాలకు 98484 94290, 95157 30477, 90320 77276, 86886 62231 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యూహాల గుమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాపై రాజకీయ పార్టీల ఫోకస్

- మెజార్టీ సీట్ల కైవసమే లక్ష్యంగా కార్యాచరణ
- ఖమ్మం కేంద్రంగా పోటాపోటీగా కార్యక్రమాల నిర్వహణ
- ఎన్నికల వరకు ఇదే జోష్ కొనసాగేలా ప్రణాళిక



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలన్నీ ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇక్కడ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ద్వారా రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు రచిస్తుండగా.. కమ్యూనిస్టు పార్టీలు సైతం అదే ప్రయత్నాల్లో ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ, కాంగ్రెస్ నిరుద్యోగ నిరసన ప్రదర్శన ఇక్కడే నిర్వహించగా.. బీజేపీ ఆధ్వర్యాన శనివారం నిరుద్యోగ మార్చ్ ఏర్పాటుచేశారు.

కార్యక్షేత్రంలో కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ నేతలు ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాల జోరు పెంచిన నేపథ్యాన గతంలో స్తబ్దుగా ఉన్న కేడర్‌లో కదలిక వచ్చింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. నేతలందరూ తమ పరిధిలో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపారు. ఇదేక్రమంలో ఏప్రిల్ 24న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు హాజరయ్యారు. గత రెండు ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నందున ఈసారి ఇంకా ఎక్కువ స్థానాలను గెలుచుకునేలా నేతలు కేడర్‌కు సూచనలు చేశారు.

కమలం.. పట్టుకు యత్నం

బీజేపీ ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోపాటు ఇతర నేతలు పలుసార్లు వచ్చివెళ్లారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు వివిధ పార్టీల్లో ఉన్న అసంతృప్త నేతలను చేర్చుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గతంలోనూ పలుమార్లు జిల్లాకు వచ్చివెళ్లగా.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ఖమ్మం వేదికగా శనివారం నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంజయ్‌తో పాటు పలువురు రాష్ట్రస్థాయి నేతలు పాల్గొననున్నారు.

బీఆర్ఎస్.. బీ అలర్ట్

ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు సాధించాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది. 2014, 2018 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా జిల్లాలో ఒక్కో సీటే దక్కించుకోవడం గమనార్హం. ఈసారి మాత్రం ఎలాగైనా అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా పరిస్థితి అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి 18న ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభ విజయవంతం కావడం శ్రేణుల్లో జోష్ నింపినట్లయింది. ఆ తర్వాత అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. ఇక తరచుగా మంత్రులు పర్యటిస్తూ కేడర్‌లో ఉత్తేజం నింపడంతోపాటు ప్రజలకు ప్రభుత్వ పథకాలను తెలియజేసేలా కేడర్‌ను సమాయత్తం చేస్తున్నారు.

చుట్టేస్తున్న కమ్యూనిస్టులు

సీపీఎం, సీపీఐ నేతలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాను చుట్టేస్తున్నాయి. ఇరు పార్టీల అగ్రనేతలు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు ఉమ్మడి జిల్లా వాసులే కావడంతో ఎన్నికల్లో ఇక్కడి నుంచి కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇందుకోసం కలిసొచ్చే పార్టీలతో పొత్తులకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో ఇరువురు నేతలు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ పొత్తు ఉన్నా, లేకపోయినా తాము పోటీలో ఉంటామనే సంకేతాలు ఇస్తున్నారు. కాగా, వచ్చేనెల 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యాన ప్రజాగర్జన సభను భారీగా నిర్వహించేలా నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఖమ్మం ఆస్పత్రికి ముస్కాన్ అవార్డు



ఖమ్మం పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ముస్కాన్ అవార్డు వరించింది. పీడియాట్రిక్ ఓపీ, పీడియాట్రిక్ వార్డు, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ విభాగాలకు సంబంధించి జిల్లా ఆస్పత్రుల విభాగంలో ఖమ్మం ఆస్పత్రి 94 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం చేజిక్కించుకుంది. ఆతర్వాత స్థానాల్లో ఉట్నూరు, సంగారెడ్డి, జనగామ, పెద్దపల్లి, నల్లగొండ ఆస్పత్రులు నిలిచాయి. ఈ ఏడాదే కేంద్రప్రభుత్వం ముస్కాన్ అవార్డులు ఇవ్వడం మొదలుపెట్టగా ఖమ్మం ఆస్పత్రి మొదటి స్థానం సాధించడం విశేషం. ముస్కాన్ కేంద్ర బృందం సభ్యులు మార్చి 22, 23వ తేదీల్లో పెద్దాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరిశీలించి నిర్వహణ, సేవలు మెరుగ్గా ఉండడంతో అవార్డు ప్రకటించారు. చిన్నారులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం 'ముస్కాన్ – చిన్నారులకు చిరునవ్వుతో సేవలు' పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నవజాత శిశు మరణాలు తగ్గించడం, 12 ఏళ్లలోపు పిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎంసీహెచ్‌లోని పిల్లల వార్డును పూర్తిగా ముస్కాన్‌కు కేటాయించారు. ఇక్కడ పిల్లలకు ఆహ్లాదకర, స్నేహపూర్వక వాతావరణంలో సేవలందేలా ఏర్పాట్లు చేయడంతో అవార్డు దక్కింది.

ఏన్కూరు పీహెచ్‌సీ ఫస్ట్!

ఖమ్మం వైద్యవిభాగం/ఏన్కూరు: జిల్లాలోని ఏన్కూరు ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ వరించింది. ఈ ఏడాది మార్చిలో ఎన్‌క్వాస్ బృందం ఆస్పత్రిని పరిశీలించగా సౌకర్యాలు, సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ 91.3 మార్కులు కేటాయించడంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కూసుమంచి, చింతకాని, వల్లబి, సుబ్లేడు, పెద్దగోపతి, బోనకల్ పీహెచ్‌సీలు, మామిళ్లగూడెం, శ్రీనివాసనగర్, ముస్తఫానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను కూడా ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వరించింది. ఇందులో పీహెచ్‌సీలకు ఏటా రూ.లక్ష చొప్పున మూడేళ్లపాటు, యూపీహెచ్‌సీలకు మూడేళ్లు రూ.3 లక్షల చొప్పున నిధులు కేటాయించనున్నారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ మాలతి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్ వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

లక్ష్యం.. రూ. 98.51 కోట్లు

- స్త్రీ నిధి రుణ ప్రణాళికాలు ఖరారు
- ఇప్పటికే రూ.71.63 లక్షల మేర పంపిణీ
- ఆర్థికంగా ఎదుగుతున్న మహిళా సంఘాల సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక స్వావలంబన కోసం వ్యాపారరంగంలోకి వస్తున్న మహిళలు పెట్టుబడిగా అధిక వడ్డీకి బయట అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన వారు నష్టపోకుండా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలను మంజూరు చేస్తుంది. సభ్యులైన మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఏటా వ్యక్తిగతంగా స్త్రీనిధి రుణాలను అందిస్తోంది. ఈ రుణాలతో మహిళలు కుటుంబ అవసరాలను తీర్చుకోవడంతో పాటు ఆర్థిక పురోగతి సాధించేలా చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మహిళా సంఘాల్లో సభ్యులై అర్హత కలిగిన వారికి ఈ ఏడాది రూ.98.51కోట్ల మేర స్త్రీనిధి రుణం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

అర్హులను గుర్తించి..

వీటల్లో నమోదైన సంఘాలను గుర్తించి అందులో అర్హులైన సభ్యులు చేసిన పొదుపు ఆధారంగా రుణాన్ని బ్యాంకుల ద్వారా అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, స్త్రీనిధి సిబ్బంది దృష్టి సారించారు. గత ఆర్థిక సంవత్సరం ప్రణాళికలు, ప్రభుత్వ సూచనలకు లోబడి ఈ సంవత్సరం రుణాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రూ.71.63 లక్షల రుణాలను మహిళా సభ్యులకు రుణాలుగా అందించారు.

ఆర్థికంగా ఎదుగుదల

సంఘంలో సభ్యులైన మహిళలు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇస్తున్న రుణంతో పాటు ప్రత్యేకంగా అందించే స్త్రీనిధి రుణాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. రుణాన్ని వినియోగించుకుని వ్యాపారాలను వృద్ధి చేసుకోవడమే కాక సకాలంలో తిరిగి చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తుండడంతో బ్యాంకులు సైతం ముందుకొస్తున్నాయి. జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీల్లో ఉన్న సంఘాల సభ్యులకు రుణాలు అందుతుండగా.. టైలరింగ్, డెయిరీ ఫాం, కిరాణం, చిరు వ్యాపారాల్లో రాణిస్తున్నారు.

మండలాలు, మెప్మా పరిధిలో రుణ లక్ష్యం వివరాలు (రూ.లక్షల్లో)

మండలం	లక్ష్యం
బోనకల్	340.82
చింతకాని	370.8
ఏన్కూర్	276.25
కల్లూర్	351.32
కామేపల్లి	278.88
ఖమ్మం రూరల్	742.75
కొణిజర్ల	513.66
కూసుమంచి	509.22
మధిర	271.34
ముదిగొండ	556.03
నేలకొండపల్లి	564.6
పెనుబల్లి	311.85
రఘునాథపాలెం	450.56
సత్తుపల్లి	415.6
సింగరేణి	193.01
తల్లాడ	360.26
తిరుమలాయపాలెం	410.04
వేంసూరు	287.05
వైరా	429.48
ఎర్రుపాలెం	517.82
మెప్మా పరిధిలో..	
కస్తూరి	632.15
మహత్మాగాంధీ	630.31
ప్రియదర్శిని	243.08
సరస్వతి	194.28

సకాలంలో లక్ష్యసాధనకు కృషి

జిల్లాకు కేటాయించిన స్త్రీనిధి రుణాల లక్ష్యాన్ని సకాలంలో చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే నెలవారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని సంబంధిత ఉద్యోగులు, మండల, గ్రామ సమాఖ్యలకు సూచనలు చేశాం. సంఘంలో అర్హులై, రుణం అవసరమున్న సభ్యులకు స్త్రీనిధి రుణాలు అందేలా చూడడమే లక్ష్యం.



– ఎం.విద్యాచందన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పాలిసెట్‌లో జిల్లాకు ర్యాంకులు

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



అనుమోలు కార్తీక



కేతేపల్లి దర్శిని



మల్లెల సాయిశ్రీజ

ఖమ్మం సహకారనగర్/మధిర/సత్తుపల్లి టౌన్: పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యార్థులు పలువురు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈనెల 17న ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 2,355మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో మధిరకు చెందిన కేతేపల్లి దర్శిని ఎం బైపీసీలో, సత్తుపల్లికి చెందిన అనుమోలు కార్తీక ఎంపీసీలో రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు సాధించారు. జిల్లా స్థాయిలో ఎంబైపీసీ విభాగం నుంచి మధిరకు చెందిన కేతేపల్లి దర్శిని, బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన జెట్టి భవిష్య, సత్తుపల్లికి చెందిన అనుమోలు కార్తీక, ఎంపీసీ విభాగంలో సత్తుపల్లికి చెందిన అనుమోలు కార్తీక, మధిరకు చెందిన కేతేపల్లి దర్శిని, మల్లెల సాయిశ్రీజ మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంబైపీసీలో రాష్ట్ర స్థాయి ఏడో ర్యాంకు సాధించిన మధిరకు చెందిన కేతేపల్లి దర్శిని తండ్రి రాజశేఖర్ చిరు వ్యాపారి కాగా, తల్లి రేణుక గృహిణి. ఆమె స్థానిక నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్‌లో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించగా, ఇప్పుడు పాలిసెట్‌లోనూ సత్తా చాటడంపై డైరెక్టర్ బోనగిరి నారాయణరావు, కరస్పాండెంట్ వనజ అభినందించారు. అలాగే, ఎంపీసీ విభాగం జిల్లా స్థాయి మూడో ర్యాంకు సాధించిన మధిర భరత్ కిడ్స్ అండ్ టెక్నో స్కూల్ పాఠశాల విద్యార్థిని మల్లెల సాయి శ్రీజను గౌరవ డైరెక్టర్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ రమ్యారెడ్డి, ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావుతో పాటు కటికల రవీందర్‌రెడ్డి, ఉమ, స్రవంతి, నాగరాజు, అజీమ్, త్రివేణి, రాజ్యలక్ష్మి అభినందించారు. ఇక సత్తుపల్లికి చెందిన అనుమోలు సతీష్–మాధవి దంపతుల కుమార్తె కార్తీక ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయి ఏడో ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు, ఎంబైపీసీలో జిల్లా మూడో ర్యాంకు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంబై ఐఐటీలో బీటెక్ చేయడమే తన లక్ష్యమని వెల్లడించింది.

బీఆర్క్‌లో జిల్లా విద్యార్థి సత్తా

న్యూవిజన్ విద్యార్థి నీరజ్‌కు ఆలిండియా మొదటి ర్యాంక్



నీరజ్‌ను అభినందిస్తున్న న్యూవిజన్ చైర్మన్ ప్రసాద్

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పేపర్–2 బీఆర్క్ ఫలితాల్లో జిల్లా విద్యార్థి సత్తా చాటాడు. ఖమ్మం న్యూవిజన్ కళాశాల విద్యార్థి గూడూరు నీరజ్‌రెడ్డి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈమేరకు న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ శుక్రవారం విద్యార్థిని అభినందించి మాట్లాడుతూ నీరజ్ 300కు 300మార్కులతో 100శాతం పర్సంటైల్ సాధించి ర్యాంకు కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఈకార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, డైరెక్టర్ సీహెచ్.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అవుతా....

మొదటి ర్యాంకు సాధించిన నీరజ్ మాట్లాడుతూ తాను ఐఏఎస్ సాధించి సమాజ సేవ చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. తద్వారా గౌరవంతో పాటు సేవ చేసే అవకాశం అధికంగా ఉంటుందని చెప్పారు. ఆలిండియా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం వెనుక తల్లిదండ్రులు, కళాశాల యజమాన్యం, అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి దయానంద్ దంపతులు

రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షాన చేరిక



దయానంద్ దంపతులకు పార్టీ కండువా కప్పుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణానికి చెందిన డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ రేణుకా చౌదరి సమక్షాన శుక్రవారం వారు కాంగ్రెస్‌లో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దయానంద్ రెండు వేల స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి అప్పటి టీఆర్ఎస్‌లో చేరిన ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ టికెట్ కోసం యత్నించి విఫలమయ్యారు. అప్పటి నుంచి టీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న ఆయన పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఇటీవలే విభేదించి దూరమయ్యారు. ఈమేరకు శుక్రవారం ఉదయం బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటన విడుదల చేశారు.

కొన్నాళ్లుగా ప్రచారం

రెండు, మూడు నెలలుగా మట్టా దయానంద్ కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఆయన కుటుంబానికి రాజకీయంగా నియోజకవర్గంలో పరిచయాలు ఉన్నాయి. దయానంద్ తల్లి మట్టా ఆరోగ్యం 2005లో కాంగ్రెస్ నుంచి సత్తుపల్లి ఎంపీపీగా, కాంగ్రెస్ నుంచే మున్సిపల్ కౌన్సిలర్‌గా దయానంద్ గెలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌తో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ టికెట్ ఆశిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈనేపథ్యాన దయానంద్ దంపతులు కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. ఆయన వెంట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణతో పాటు జక్కుల ప్రభాకర్, ఇమ్మినేని ప్రసాద్, దొడ్డా శ్రీనివాసరావు, నరుకుళ్ల అప్పారావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణవరపు శ్రీనివాసరావు, జంగా శ్రీనివాసరెడ్డి, పాముర్తి నాగేశ్వరావు, ఎం.డీ.కమల్‌పాషా, బత్తుల భరత్, ఒంటెద్దు సాయిలు, మొరిశెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



పాట పాడుతున్న 'బలగం' మొగిలయ్య, కొమరమ్మ, పక్కన ఎంపీలు నాగేశ్వరరావు, రవిచంద్ర తదితరులు

ఎంపీ నామా నాగేశ్వరరావు

ముదిగొండ: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమైందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో రూ.15లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ.కోట్ల నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అలాగే, రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, నిరుపేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఉచిత విద్యుత్ పథకాలు అమలుచేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కాగా, గోకినేపల్లి నుంచి కట్టకూరు వరకు బీటీ రోడ్డు, వెంకటాపురం సమీపంలో నేషనల్ హైవే వద్ద అండర్ పాస్ ఇప్పించాలని స్థానికులు ఎంపీని కోరారు.

బుడగ జంగాల ప్రస్థానం ప్రారంభం

మండలంలోని గంధసిరిలో మూలికా వైద్యులు పస్తం సహదేవరాజు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రచ్చబండ.. బేడ బుడగ జంగాల ప్రస్థానాన్ని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బలగం చిత్రం సినిమాతో పేరు తెచ్చుకున్న గాయనీ, గాయకులు మొగిలయ్య, కొమరమ్మ ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం వారికి సహదేవరాజు, ఆయన కుమార్తె చంద్రకళ రూ1.5లక్షల నగదు అందజేశారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, వెంకట్ గౌడ్‌తో పాటు సుభాషిణి, వెలగొండస్వామి, పోట్ల ప్రసాద్, బత్తుల వీరారెడ్డి, మీగడ శ్రీనివాస్‌యాదవ్, బంకా మల్లయ్య, సిద్దిబాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవీఎంల శిక్షణలో కలెక్టర్, అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శుక్రవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈవీఎంల నిర్వహణ, ఇతర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించగా జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ హాజరయ్యారు.

28 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు భర్తీ



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని పల్లె దవాఖానాల్లో ఖాళీగా ఉన్న 28 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను భర్తీచేశారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులు భర్తీ చేశామని డీఎంహెచ్‌ఓ మాలతి తెలిపారు. కౌన్సిలింగ్‌లో కమిటీసభ్యులు జెడ్పీ సీఈఓ అప్పారావు, ఇన్‌చార్జ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంగళ, ఉద్యోగులు మోత్యా, వలీ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ముందస్తుగా సాగు చేయాలి



మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంరూరల్: రైతులు వరి పంటను ముందస్తుగా సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల సూచించారు. మండలంలోని కస్నాతండా రైతువేదికలో శుక్రవారం రైతులకు ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ముందస్తుగా సాగు చేయడం వల్ల ఏప్రిల్, మే నెలల్లో వచ్చే అకాల వర్షాల నుండి పంటను కాపాడుకోవచ్చనని తెలిపారు. అలాగే, వరి సాగుకు ముందు జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలని చెప్పారు. కూసుమంచి ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ రాజు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో బాలసదనం చిన్నారులు



ఎగ్జిబిషన్ ఆవరణలో పిల్లలు

ఖమ్మం మయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఉంటున్న చిన్నారులను పెవిలియన్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్లారు. నిర్వాహకుల విజ్ఞప్తితో పిల్లలను పంపించగా సరదాగా గడిపారని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. కాగా, నిర్వాహకులే పిల్లలకు భోజన ఏర్పాట్లు కూడాచేశారు.

ద్విచక్రవాహనాన్ని అపహరించిన బాలుడు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఓ బాలుడు చోరీ చేసిన ఘటన ఇది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ పుల్లయ్య గురువారం ఉదయం విజయవాడ ఆస్పత్రికి వెళ్తూ బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో కేంద్రం ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి వెళ్లాడు. రాత్రి వచ్చేసరికి ద్విచక్రవాహనం కన్పించకపోవడంతో ఆరా తీశారు. అయితే, గురువారం మధ్యాహ్నం ఓ బాలుడు వచ్చి తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బండి తాళం పోయిందని కార్గో సిబ్బందికి నమ్మబలికాడు. దీంతో వారు అనుమానంతో బాలుడి ఫొటో తీసి పంపించారు. అనంతరం బాలుడు వైర్లు కత్తిరించి వాహనాన్ని దొంగిలించి వెళ్లిపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పుల్లయ్య తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి, తీవ్ర గాయాలు

బెల్ట్ షాపు వద్ద ఘటన

నేలకొండపల్లి: కానిస్టేబుల్‌పై నలుగురు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని చెన్నారానికి చెందిన హసన్ ఖమ్మంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని వచ్చే సమయాన రాజేశ్వరపురం వద్ద ఆయనకు ఓ యువకుడితో వివాదం జరిగినట్లు తెలుస్తుంది. అతర్వాత ఇంటికి వెళ్తూ గ్రామంలోని ఓ బెల్ట్ షాపులోకి వెళ్లాడు. దీంతో ఆ యువకుడు మరో నలుగురితో కలిసి వచ్చి దాడి చేయగా హసన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. హసన్ కేకలు వేయటంతో ఇంట్లో ఉన్న బెల్ట్‌షాపు నిర్వాహకులు వచ్చేసరికి దాడి చేసిన వారు పరారు కాగా, దాడికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం





ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న ఖమ్మం జిల్లా పురుషులు, మహిళల జట్లు

- మహిళలు, పురుషుల విభాగాల్లో సత్తా
- ముగిసిన రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ మీట్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలు ముగియగా పురుషులు, మహిళల విభాగాల్లోనూ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఖమ్మం జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. ఈసందర్భంగా ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామి, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ.గౌస్ విజేత జట్లకు బహుమతులు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, వెంకటేశ్వరెడ్డి, మురళీధర్, ఎం.డీ.మతిన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల పురుషుల 200 మీటర్ల పరుగులో ఎస్.కే.లాల్‌పాషా(ఖమ్మం), ఎస్.శివతేజవైభవ్‌రెడ్డి(నల్లగొండ), వి.వంశీకృష్ణ (భద్రాద్రి కొత్తగూడెం), 1,500 మీటర్లలో కుసం రవి(జయశంకర్ భూపాల పల్లి), జి.ఉదయ్‌కిరణ్(జనగామ), కె.కిరణ్(రంగారెడ్డి), 10 వేల మీటర్ల పరుగులో టి.భజరంగ్(రంగారెడ్డి), వి.ధనుష్(నల్లగొండ), జి.అభిషేక్(సిద్దిపేట), 20 కిలోమీటర్ల వాకింగ్‌లో ఈ.విష్ణువర్ధన్(కరీంనగర్), ధరంవీర్ సింగ్(టీఏఏ), సీహెచ్.నాగరాజు(కరీంనగర్), హ్యామర్ త్రోలో టి.రంజిత్‌కుమార్(జనగామ), ఎం.విక్రంకుమార్(పెద్దపల్లి), షేక్ ఆఫ్తాబ్(ఖమ్మం) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. అలాగే, మహిళల విభాగం 200 మీటర్ల పరుగులో ఎ.మైథిలి(ఖమ్మం), బి.రాగవర్షిని(హైదరబాద్), పి.రామస్వామి(రంగారెడ్డి), 1,500 మీటర్ల పరుగులో కె.విశాలక్షి(హైదరాబాద్), ఎల్.మాధురి(మహబూబాబాద్), టి.కల్పన(సిద్దిపేట), 10వేల మీటర్ల పరుగులో ఎస్.మనూషా(జగిత్యాల), ఎ.కల్యాణి (సిద్దిపేట), జి.మానస(నాగూర్ కర్నూల్), 20 కిలోమీటర్ల పరుగులో ఎస్.వసంత, టి.సౌమ్య(జగిత్యాల), హ్యామర్‌త్రోలో హాజీరా ఫాతిమా(ఖమ్మం)కు మొదటి మూడు స్థానాలు దక్కాయి.

వేంకటేశ్వరుడి సన్నిధిలో పండుగ

- ఆలయంలో ప్రతిష్ఠాపనకు 16రోజులు
- హాజరైన నిర్మాణదాతలు దాసరి జయపాల్‌రెడ్డి – శ్రీలక్ష్మి

సత్తుపల్లి రూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి పదహారు రోజుల అవుతున్న సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాత దాతలు దాసరి జయపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా అర్చకులు స్వామికి సంప్రోక్ష పూజలు, విశ్వక్షేత్ర పూజలు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోవింద నామ స్మరణతో ఆలయం మారుమోగింది. ఈ కార్యక్రమంలో దాసరి ప్రసాద్‌రెడ్డి, దాసరి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, సత్యానారాయణరెడ్డి, గుండు పుల్లయ్య, గుండు ఉమామహేశ్వరరావు, కర్పూరం మురళీ, హలావత్ రాంబాబు, భద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టువదలకుండా ఆలయ నిర్మాణం

దాసరి జయపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ఆలయ నిర్మాణానికి 20 ఏళ్ల క్రితమే ఆరు కుంటల భూమి అందించారు. ఏళ్లు గడుస్తున్నా ఆర్థిక సహకారం లేకపోవడంతో వారే మళ్లీ పూనుకోగా జయపాల్ రెడ్డి రూ.10 లక్షలు, శ్రీలక్ష్మి రూ.5 లక్షలతో పాటు కూతురు ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి రూ.10 లక్షలు విరాళంగా అందించారు. అనంతరం టీటీడీకి చేసిన దరఖాస్తుతో టీటీడీ అధికారి జవహర్‌రెడ్డి పరిశీలించి రూ.25 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులకు తోడు గ్రామపెద్దలు, ప్రజలు విరాళాలను అందించడంతో ఆలయ నిర్మాణం పూర్తిచేసి గతనెల 11న స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈమేరకు పదహారు రోజుల పండుగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న జయపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు, భక్తులు



జయపాల్‌రెడ్డి - శ్రీలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తెలంగాణలోనే బ్రాహ్మణులకు గౌరవం

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం బ్రాహ్మణులకు ప్రత్యేక గౌరవాన్ని ఇస్తోందని బ్రాహ్మణ సంఘాల జిల్లా నాయకులు తెలిపారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని గాయత్రి భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధి వనం కృష్ణవేణి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటు చేయగా, పేద బ్రాహ్మణులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. కాగా, హైదరాబాద్‌లో నిర్మించిన విప్రసదనం బ్రాహ్మణ భవనాల ప్రారంభ కార్యక్రమాలు ఈనెల 30, 31వ తేదీల్లో జరుగుతాయని, జిల్లా నుంచి బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఈశ్వరప్రగడ హరిబాబు, పలివెల సుబ్బారావు, కొదమసింహం మురళీకృష్ణమాచార్యులు, వట్టిపల్లి లక్ష్మీనర్సింహారావు, తాటికొండల సీతారామశాస్త్రి, చాగంటి రామకృష్ణ, మాటూరి లక్ష్మీనారాయణ, కొండూరి ఆదిత్య, సరస్వతికుమార్, వట్టిపల్లి రాజ్యలక్ష్మి, సోమరాజు శ్రీదేవి, మాడంబ శ్రీకాంత్, సరస్వతిభట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు భూకేటాయింపుపై జీఓ

మంత్రి పువ్వాడకు కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం 23.02 ఎకరాల ఎన్నెస్పీ స్థలాన్ని కేటాయిస్తూ శుక్రవారం జీఓ 147ను జారీ చేసింది. జర్నలిస్టుల కోసం స్థలాన్ని కేటాయిస్తూ ఇటీవల కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈమేరకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో కలిపి 23.02 ఎకరాల ఎన్నెస్పీ (నాగార్జున సాగర్ ప్రాజెక్టు) అదనపు స్థలాన్ని కేసీఆర్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్(ఖమ్మం)కి కేటాయిస్తూ జీఓ జారీ చేశారు. ఈమేరకు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు జర్నలిస్టు సంఘాల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

3నుంచి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో వచ్చే నెల 3నుంచి 7వ తేదీ వరకు జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 500 మంది ప్రతినిధులు తరగతులకు హాజరవుతారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు బొంతు రాంబాబు, ప్రవీణ్‌తో పాటు సుధాకర్, తరుణ్, సాయివెంకటేష్, సతీష్, ఉమేష్, సాయి, వీరేందర్, ఉపేందర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

28 నుంచి కేంద్ర బృందం పర్యటన

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు కేంద్ర వైద్య బృందం జిల్లాలో పర్యటించనుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పీ, పీహెచ్‌సీ వైద్యాధికారులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర బృందం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలిస్తారని పేర్కొన్నారు.

పాలిసెట్‌లో త్రివేణి విద్యార్థులకు ర్యాంకులు

ఖమ్మంసహకారనగర్: పాలిసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని త్రివేణి విద్యాసంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్ర చౌదరి వెల్లడించారు. పాఠశాలకు చెందిన పి.మణి చంద్రసాయి 120 మార్కులకు 111 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 64వ ర్యాంకు, ఎల్.అనిరుధ్ 146 ర్యాంకు, ఏ. ప్రకాష్ 195, జి.రిషిత 136, పి.లక్ష్మీనరిణి 689, బి.సిరి 409, ఎం.డీ.జుబేర్ 812, ఖ్యాతి హర్షిణి 866, జి.భవ్య 997 ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీరేంద్రచౌదరి, త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వెంకటేశ్వరరావు, సీఆర్వో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌తో పాటు ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బీఆర్క్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పేపర్–2 బీఆర్క్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈమేరకు విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య అభినందించి మాట్లాడారు. పేపర్–2బీ ప్లానింగ్ విభాగంలో పీడబ్ల్యూడీ కేటగిరీ నుంచి బి.నిషా గోపిక ఆలిండియా ఒకటో ర్యాంక్, పేపర్–2ఏ బీఆర్క్‌లో ఆలిండియా స్థాయిలో రెండో స్థానం సాధించిందని తెలిపారు. అలాగే, బి.లోకేష్ 202, ఈ.సాయి ఈశ్వర్ 213, ఎం.డీ.అబ్దేర్ తబసం 374, పి.సాత్విక్ 446, ఏ.శ్రీచక్ర తారక్‌రాం 449, కె.ప్రవీణ్‌కుమార్ 519, సీహెచ్.సాత్విక 534, జె.ప్రణీత్ 541, ఎం.శివసాన్ చరణ్ 560, బి.లలిత్ సిద్ధార్థ 606, పి.హర్షిత్ చౌదరి 763, బి.భానుకృష్ణతేజ 825, బి.వివేక్ వర్ధన్‌వర్మ 863, బి.చరణ్‌తేజ 910వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం చేతన్ మాథూర్, అకడమిక్ డీన్ ఎస్ఆర్ ఎస్.డీ.వర్మ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



నిషాగోపికను అభినందిస్తున్న శ్రీచైతన్య డైరెక్టర్ శ్రీవిద్య

రామయ్యను దర్శించుకున్న రైల్వే అధికారి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ రాజీవ్‌కుమార్ గంగూలీ(ఐఆర్ఎస్ఈ) కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలకగా, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత పంచవటి కుటీరం, నార చీరల ప్రాంతాల విశిష్టతను తెలుసుకున్నారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ మేనేజర్ రాజీవ్ నిష్ కుమార్ పాల్గొన్నారు.



పంచవటి కుటీరం వద్ద కుటుంబంతో గంగూలీ

ప్రశాంతంగా ఐసెట్

ఖమ్మం సహకారనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన శుక్రవారం నిర్వహించిన ఐసెట్ ప్రశాంతంగా జరిగిందని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి తెలిపారు. జిల్లాలో ఉదయం పరీక్షకు 494మందిలో గాను 444మంది, మధ్యాహ్నం పరీక్షకు 494మందికి గాను 457మంది హాజరయ్యారని వెల్లడించారు.

ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిలో జెండాలు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన పలువురు ఇళ్ల స్థలాల కోసం సర్వే నంబర్ 34లోని ప్రభుత్వ భూమిలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యాన ఎర్రజెండాలు పాతారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన వడ్డెరలు కుటుంబ సభ్యులతో కలిసి చేరుకుని క్వారీ స్థలమంటూ అడ్డుకున్నారు. దీంతో రెండు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. క్వారీ స్థలమంటూ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారని పేదలు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎస్సై బి.రాము చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. సత్తుపల్లి తహసీల్దార్ వద్దకు వెళ్లి మాట్లాడుకోవాలని సూచించి పంపారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్, నాయకులు మాచర్ల భారతి, మెరుగు సత్యనారాయణ, మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ తుంబూరుకు చెందిన పేదలు సత్తుపల్లి తహసీల్ ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్థలాన్ని సర్వే చేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



క్వారీ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న పేదలు, సీపీఎం నాయకులు

ఎక్సైజ్ వాహనాన్ని అడ్డగించి సారాతో పరారీ

తిరుమలాయపాలెం: నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు తీసుకెళ్తుండగా ఆయన సోదరుడు వాహనాన్ని అడ్డగించి సారా తో సహ పరారు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బచ్చోడుతండాలో ఎక్సైజ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ సరిత, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుగులోతు రవి వద్ద రెండు లీటర్ల నాటుసారా లభించడంతో ఆయనను జీపులో ఎక్కించారు. ఈక్రమంలో రవి తమ్ముడు రాకేష్ జీపుకు అడ్డుతగిలి తన సోదరుడు, నాటుసారా తీసుకుని ఇద్దరూ పరారయ్యారు. ఘటనపై ఎక్సైజ్ అధికారులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎం, ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని డీసీఎం ఢీకొట్టిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని పల్లిపాడులో శుక్రవారం జరిగిన ఈ ప్రమాద వివరాలను ఎస్సై జె.శంకరరావు వెల్లడించారు. సింగరాయపాలెంకు చెందిన తెల్ల బోయిన నర్సింహారావు(48) వైరా సమీపంలోని వైష్ణవి పాల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. శుక్రవారం తెల్ల వారుజామున ఫ్యాక్టరీ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పల్లిపాడు సెంటర్‌లో ఖమ్మం నుంచి వైరా వైపు వెళ్తున్న డీసీఎం వాహనం మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమాన నర్సింహారావును ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహారావుకు భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శంకర్‌రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చేసిన ఆయన మళ్లీ తన స్నేహితులను దించడానికి ఫ్యాక్టరీకి వెళ్లినట్లు సమాచారం. ఈక్రమంలో తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందడం విషాదాన్ని నింపింది.



నర్సింహారావు (ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యక్తి..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సుంకర నర్సింహారావు(59) గురువారం రాత్రి పది గంటల సమయాన కిటికీ వద్ద ఉన్న దుప్పట్లు తీస్తుండగా విద్యుత్ వైరు నుంచి ఐరన్ మెష్‌కు కరెంట్ సరఫరా కావడంతో షాక్ తగిలింది. దీంతో నర్సింహారావు అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై సురేష్ తెలిపారు.



నర్సింహారావు (ఫైల్)

వడదెబ్బతో ఉపాధి కూలీ..

కారేపల్లి: ఉపాధి పనులకు వెళ్లిన మహిళ వడదెబ్బ బారిన పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందింది. మండలంలోని తులిస్యాతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ సునీత(35) ఈనెల 23న ఉపాధి పనులకు వెళ్లి మధ్యాహ్నం వచ్చేసరికి వడదెబ్బకు గురైంది. ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, ఎంపీడీఓ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి నాగలక్ష్మికి సమాచారం ఇచ్చారు.



సునీత (ఫైల్)

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లికి చెందిన చిన్నారి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. గ్రామానికి చెందిన పడిగల గోపి – త్రివేణి దంపతులకు కుమార్తెలు ఉదయశ్రీ, సాయిశ్రీ(3) కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె సాయిశ్రీ ఇటీవల ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం తాటిగుమ్మిలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ శుక్రవారం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని మడుపల్లికి తీసుకురాగా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



సాయిశ్రీ (ఫైల్)

ప్రమాదవశాత్తు లారీ క్లీనర్..

మణుగూరురూరల్: ప్రమాదవశాత్తు లారీ పైనుంచి పడి ఓ లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం శుక్రవారం సాంబాయిగూడెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన గుద్దేటి వెంకటరెడ్డి అనే క్లీనర్ యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీపై నుంచి కిందపడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా...

తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్య


ప్రొఫెసర్ కనకయ్య

తెయూ(డిచ్‌పల్లి): ఈసీ (పాలకమండలి) నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్యను వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌గుప్తా నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే కనకయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. వీసీ రవీందర్‌గుప్తా, పాలక మండలి సభ్యులు, రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రొఫెసర్ యాదగిరి తర్వాత తానే సీనియర్‌నని చెప్పారు. బయట యూనివర్సిటీలకు చెందిన వారిని రిజిస్ట్రార్‌గా తెస్తే ఒప్పుకునేది లేదన్నారు. ఇదే విషయాన్ని తాను రెండు నెలలుగా ఈసీ మెంబర్లకు చెప్పడంతో పాటు వారిని వ్యక్తిగతంగా కలిసి విన్నవించానని, కొందరు ఈసీ మెంబర్లు సైతం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారని వివరించారు. వచ్చే నెల 3న జరిగే ఈసీ సమావేశంలో తనను రిజిస్ట్రార్‌గా ఆమోదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన కనకయ్యను పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

అన్యమత ప్రచారం చేయొద్దు

గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు



అన్యమత ప్రచారం చేయొద్దంటూ గోపన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డు

బిచ్కుంద: తమ గ్రామంలో అన్యమత ప్రచారాన్ని నిషేధించినట్టు కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రచారం చేయవద్దు.. దయచేసి సహకరించండి.. అతిక్రమించి గ్రామంలో మత ప్రచారం చేస్తే తన్ని పోలీసులకు అప్పగిస్తామని'.. బోర్డులో పేర్కొన్నారు. కాగా 20 రోజుల క్రితం పుల్కల్ గ్రామంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని కొందరు యువకులు ఓ ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. దీంతో వారిపై అట్రాసిటీ కేసు నమోదైంది. పుల్కల్‌లో జరిగిన ఘటన పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేసినట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు.

ప్రతి నెలా పీఏసీ

- కాంగ్రెస్ ముఖ్య నేతల నిర్ణయం
- పీఏసీలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి
- 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరిట కార్యక్రమాలు
- బీసీ గర్జనకు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకు ఆహ్వానం


కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ముఖ్యనేతలు

సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి ప్రతి నెలా మొదటి వారంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ ముఖ్య నేతలు నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అంశాలు పీఏసీలో చర్చించాలని, ఆ తర్వాతే నిర్ణయాలు అమలు చేయాలని తీర్మానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీ గౌడ్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్‌జావెద్, సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ ఉన్నట్టా లేనట్టా?

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్‌రావ్ ఠాక్రే బాధ్యతలు చేపట్టిన తర్వాత పీఏసీ సమావేశాలు నిర్వహించకపోవడంపై చర్చ జరిగింది. తొలినాళ్లలో ఒకసారి మాత్రమే నిర్వహించారని, ఆ తర్వాత ఎలాంటి సమావేశం జరపకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రతి నెలా మొదటి వారంలో పీఏసీ సమావేశం నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా పార్టీ తరపున నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. 'వచ్చే నెల రెండో తేదీన జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం రోజుకో కార్యక్రమం చొప్పున 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పాలి..' అని నిర్ణయించారు. ఈ కార్యక్రమాలు జరుగుతున్నన్ని రోజులు పార్టీ శ్రేణులు తమ ఇళ్లపై కాంగ్రెస్ జెండాలు ఎగురవేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారు: మధుయాష్కీ

గతంలో ఆంధ్ర వాళ్లు దోచుకుంటున్నారని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. ముఖ్య నేతల భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వీహెచ్, సంపత్‌కుమార్, నదీమ్ జావెద్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో బీసీ గర్జన ఏర్పాటు చేస్తామని, ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను ఆహ్వానిస్తామని చెప్పారు. పార్లమెంటు నూతన భవన నిర్మాణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలంతా బహిష్కరించనున్నట్టు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హిమాచల్ సీఎం సుఖుపై బీఆర్ఎస్ నేతల విమర్శలను వారి విచక్షణకే వదిలివేస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు.

త్వరలో సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య.. వందేభారత్

- ప్రస్తుతం ఇరు నగరాల మధ్య 11 గంటల ప్రయాణ సమయం
- వందేభారత్‌తో ఇక ఆరున్నర గంటలే
- మరింత పెరగనున్న వాణిజ్య సంబంధాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు త్వరలో మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాబోతోంది. హైదరాబాద్-నాగ్‌పూర్ మధ్య ఈ రైలు ప్రారంభం కానుంది. ఈ సంవత్సరారంభంలో దక్షిణమధ్య రైల్వేకు మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రైల్వే బోర్డు మంజూరు చేసింది. అందులో తొలి రైలు సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య సంక్రాంతి రోజున ప్రారంభమవగా ఏప్రిల్‌లో సికింద్రాబాద్-తిరుపతి మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. మూడో వందేభారత్ రైలు హైదరాబాద్-పుణే మధ్య ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పుడు దానికంటే ముందు నాగ్‌పూర్‌తో అనుసంధానం తెరపైకి వచ్చింది. దీనికి రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ఈ రెండు నగరాల మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను దృష్టిలో పెట్టుకొని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

తగ్గనున్న ప్రయాణ సమయం..


నాగ్‌పూర్-హైదరాబాద్ మధ్య ఇప్పటివరకు శతాబ్ది, రాజధాని లాంటి ప్రీమియర్ కేటగిరీ రైళ్లు లేవు. సాధారణ రైళ్లు ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తున్నా ఇరు నగరాల మధ్య 581 కి.మీ. దూరం ఉండటంతో ప్రయాణ సమయం 11 గంటలుగా ఉంటోంది. దీంతో ప్రయాణ సమయాన్ని తగ్గిస్తే వ్యాపార బంధం మరింత దృఢంగా మారుతుందన్న ఉద్దేశంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతానికి చెందిన ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్ ఇటీవల రైల్వే మంత్రిని కలిసి వందేభారత్ రైలును కోరారు. విదర్భలోని వార్ధా ఎంపీ రామ్‌దాస్ కూడా ఈ మేరకు విన్నవించారు. వాటికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాత్కాలిక టైంటేబుల్ ఇలా...

ప్రతిపాదిత వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక టైంటేబుల్‌ను అధికారులు రూపొందించారు. దీని ప్రకారం రైలు నాగ్‌పూర్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12:30కు సికింద్రాబాద్ చేరుకోనుంది. మళ్లీ మధ్యాహ్నం 1:30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుంది. వారంలో ఆరు రోజులు ఈ రైలు తిరగనుంది. బల్లార్షా, సిర్పూర్, కాగజ్‌నగర్, రామగుండం, కాజీపేటల్లో ఈ రైలుకు తాత్కాలిక స్టాప్‌లను కేటాయించారు. ఎకానమీలో రూ.1,450- రూ.1,550, ఎగ్జిక్యూటివ్‌లో రూ.2,750-రూ.2,850 వరకు చార్జీలను ఖరారు చేసే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వలసల జిల్లాగా మార్చిందే కాంగ్రెస్

- పాలమూరును అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ ఏర్పాటు అవసరమేలేదు
- కాంగ్రెస్ పార్టీపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు జిల్లాను వలసలకు చిరునామాగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయేనని.. అప్పుడు పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉండేదే కాదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జడ్చర్ల కాంగ్రెస్ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. పాలమూరు జిల్లాలో 14 రోజులకోసారి మంచినీళ్లు వచ్చే పరిస్థితి కాంగ్రెస్ వల్లే దాపురించిందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పాలమూరులో నిత్యం తాగునీరు వస్తోందని, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలపాటు కరెంట్, రైతులకు పంట పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు పథకం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కేవలం రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను కూడా కాంగ్రెస్ పాలనలో పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. సాగు, తాగునీటిని అందించి వలసలు వాపస్ వచ్చేలా చేశామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి అందిస్తున్నామని, అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

పార్ట్-బీతో భూములు ఫట్

గ్రామకంఠం భూముల్లో బీఆర్ఎస్ కబ్జాలు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



బిజినేపల్లి: దేశ విభజన సమయంలో హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిన వారి భూముల సమాచారం సమగ్ర భూ సర్వేతో సేకరించి వాటిని పార్ట్-బీలో చేర్చి విలువైన భూములను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం దోచుకుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. నిజాం పాలకులు సామాజిక అవసరాల కోసం ప్రతి గ్రామంలో కేటాయించిన 30% గ్రామకంఠం భూములను కూడా పార్ట్-బీలో చేర్చి గ్రామాల్లోని బీఆర్ఎస్ పెద్దలు తమకు కావాల్సిన వారి పేరిట ఎక్కించి అమ్ముకుంటున్నారన్నారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం తిమ్మాజిపేట మండలంలోని మరికల్ గ్రామం వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా తిమ్మాజిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని ప్రజల దాహార్తి కోసం తీసుకున్న కృష్ణా నీళ్లు ఈ ప్రాంతంలో ఉన్న బీడు భూములకు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇంటింటికి శుద్ధజలం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును నిర్వీర్యం చేసి.. ప్రజలకు నీళ్లు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసి బిడ్డలకు మంచినీళ్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఐటీడీఏ ప్రాజెక్టుల ద్వారా తవ్విన బావులే ఇప్పటికీ వారి దాహం తీరుస్తున్నాయని పేర్కొన్నారు. కొలువుల కోసం కొట్లాడితే కేసులు పెట్టి ఉద్యోగాలు రాకుండా చేస్తుందన్న భయంతో నిరుద్యోగులు తమ స్వేచ్ఛను కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.


సీపీఎం నాయకుడు సైదులును ఈడ్చేస్తున్న ఎస్‌ఐ మహేష్

సీపీఎం నాయకుడిని ఈడ్చుకెళ్లిన ఎస్‌ఐ

- ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని సీపీఎం ఆందోళన
- ఆందోళనకారులను ఈడ్చిపడేసిన ఎస్‌ఐ

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని విభళాపురం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం పలువురు లబ్ధిదారులతో పాటు సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద దారికి అడ్డంగా ముళ్లకంచె వేసి ధర్నా చేశారు. అక్కడికి చేరుకున్న స్థానిక ఎస్‌ఐ మహేష్ ఆందోళనకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న జిల్లా సీపీఎం నాయకుడు సైదులును ముళ్లకంచె మీదుగా ఈడ్చేశాడు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఎస్‌ఐని అడ్డుకునే క్రమంలో వారితో కూడా దురుసుగా ప్రవర్తించారు. ఎస్‌ఐ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు ఖండించారు.

జిల్లా వార్తలు

'మన ఊరు-మన బడి' డాక్యుమెంటరీ చిత్రీకరణ


కొత్తగూడెం పాఠశాలలో డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో 'మన ఊరు-మన బడి' ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల వివరాలతో డాక్యుమెంటరీని చిత్రీకరించారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం జిల్లాకు రాగా, పలు పాఠశాలల్లో పనులను పరిశీలించారు. అనంతరం డాక్యుమెంటరీ చిత్రీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు - మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు సమకూరిన నేపథ్యాన పిల్లలను చేర్పించాలని పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి కోరారు. జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ పంచాయతీ పరిధి ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ప్రచార కరత్రాలను ఆర్‌జేడీ శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పించడమే కాక నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ జుంకీలాల్, సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, హెచ్ఎంలు లీల, జ్యోతిరాణితో పాటు లగడపాటి రమేష్, ఒట్టికొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

29న 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పరిశ్రమలు, సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఈనెల 29వ తేదీన 'నిధి ఆప్‌కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లా వాసులు సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9-30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ఉపాధి కూలీలకు అండగా తపాలా శాఖ

- ఇంటి వద్ద, పని ప్రాంతాల్లో వేతనం పొందే అవకాశం
- సేవలకు రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ గ్రీన్ సిగ్నల్
- మారుమూల ప్రాంతాల కూలీలకు ప్రయోజనకరం



ఖమ్మంగాంధీచౌక్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తెలంగాణ తపాలా శాఖ శుభవార్త చెప్పింది. ఉపాధి హామీ పనులు చేసే వారికి వేతనాలు చెల్లించేందుకు తపాలా శాఖ ముందుకొచ్చింది. దీంతో మారుమూల ప్రాంతాల్లో ఉపాధి కూలీల ఇబ్బందులు తీరనున్నాయి. ఇప్పటి వరకు కూలీలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వేతనం చెల్లిస్తోంది. ఈ విధానంలో మారుమూల ప్రాంతాల కూలీలు పైకం కోసం రోజంతా వ్యయ ప్రయాసాలకు ఓర్చి మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈనేపథ్యాన ఇంటి వద్దే కాక పని ప్రదేశాల్లోనూ వేతనాలు చెల్లించేందుకు తపాలా శాఖ ముందుకు రావడంతో ఖమ్మం జిల్లాలో సుమారు 70 వేల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 80 వేల మందికి పైగా కూలీలకు సేవలు చేరువ కానున్నాయి.

అవగాహన కల్పిస్తూ..

కేంద్రప్రభుత్వం ద్వారా నిర్వహించే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఉపాధి లభిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో చెరువులు, కుంటల అభివృద్ధి, రహదారులు, కాల్వల నిర్మాణం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు తపాలా శాఖ ద్వారా వేతనాలు పంపిణీ చేయనుండడంతో ఇబ్బందులు తీరనున్నాయి. ఈమేరకు సిబ్బంది కూలీలను కలుస్తూ తపాలా శాఖ ద్వారా అమలయ్యే పథకాలను వివరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధానం ద్వారా కూలీలను తపాలా శాఖ నిర్వహిస్తున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)లో ఖాతాదారులుగా చేర్పించి వారి వేతనాలు జమ చేయిస్తారు. తద్వారా కూలీలు తాము ఖాతా కలిగిన సుదూర ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లే ఇక్కట్లు తీరుతాయి. నిత్యం అందుబాటులో ఉండే పోస్టాఫీస్ లేదా పోస్టుమ్యాన్ ద్వారా వేతనాలు తీసుకోవచ్చు. అలాగే, బ్యాంక్ ఖాతాల్లో జమ అయినా ఆధార్ అనేబుల్ పేమెంట్ విధానం(ఏఈపీఎస్) ద్వారా తపాలా ఉద్యోగులు పని ప్రాంతాలు, ఇళ్ల వద్ద వేతనాలను చెల్లించేలా చర్యలు చేపట్టింది. ఈ విషయమై తపాలా శాఖను తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అభినందించటంతో పాటు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు ప్రయోజనం



ఖమ్మం డివిజన్‌లో మొత్తం 823 పోస్టాఫీసులు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుమూల ప్రాంతాల వరకు ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాల్లో తపాలా సౌకర్యం అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఉపాధి హామీ కూలీలకు వేతనాలను పని ప్రదేశాలు, ఇళ్ల వద్దే అందించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.

– బి.రవికుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం తపాలా డివిజన్

నాగసాధువుల సాష్టాంగ నమస్కార యాత్ర


సాష్టాంగ నమస్కార యాత్ర చేస్తున్న నాగసాధువులు

చండ్రుగొండ: ఉత్తరాఖండ్‌కు చెందిన నాగసాధువులు చేపట్టిన సాష్టాంగ నమస్కారయాత్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతోంది. లోకకల్యాణార్థం కోసం ఈ యాత్ర చేపట్టామని సాధువులు జిల్లాలోని శుక్రవారం చండ్రుగొండకు వచ్చిన సందర్భంగా తెలిపారు. తమిళనాడులోని రామేశ్వరం వరకు యాత్ర సాగుతుందని దామోదర్‌దాస్ పూజారి వెల్లడించారు. ఇప్పటివరకు 4వేల కిలోమీటర్ల యాత్ర పూర్తయిందని, రోజుకు ఎనిమిది నుండి పది కిలోమీటర్లు వెళ్తున్నట్లు తెలిపారు. కాగా, థర్మకోల్ షీట్ మాదిరి అట్టను జరుపుకుంటూ సాష్టాంగ నమస్కారాలతో ముందుకు సాగుతున్న సాధువులను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

పెద్దమ్మగుడి టెండర్లు వాయిదా

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద కొబ్బరికాయల దుకాణాల నిర్వహణ, చీరలు పోగు చేసుకునే హక్కు కల్పించే టెండర్లను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేశారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన టెండర్, వేలంలో తక్కువ మంది హాజరు కావడం, సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్ ఆధ్వర్యాన వేలం నిర్వహించగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, డైరెక్టర్లు కిలారు నాగమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ప్రభులత


ఉద్యోగికి నగదు బహుమతి అందజేస్తున్న ఆర్ఎం

భద్రాచలంటౌన్: ఆర్టీసీ ప్రయాణమంటే సురక్షితమైనదనే భరోసా కల్పిస్తూనే ఆదాయ వనరులపై ఉద్యోగులు దృష్టి సారించాలని ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ప్రభులత సూచించారు. భద్రాచలం డిపోలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె ప్రతిభ కనభరిచిన ఉద్యోగులను నగదు బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ భద్రాచలం డిపోకు ఆదాయం ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం డిపో రాష్ట్రంలో 13వ స్థానంలో ఉన్నందున మరింత ఆదాయం పెంపునకు కృషి చేయాలన్నారు. ఆతర్వాత ఉద్యోగులకు ఆమె మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ బి.రామారావు, ఉద్యోగులు వి.గౌతమి, శ్రీనివాస్, సాహితి, వెంకన్న పాల్గొన్నారు.

రామయ్యకు వెండి పాదుకలు



ఏఈఓకు వెండి పాదుకలను అందచేస్తున్న దాత (ఇన్‌సెట్) వెండి పాదుకలు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం వెండి పాదుకలను బహుకరించారు. తిరుపతికి చెందిన శ్రీలత రూ.70వేల విలువైన 930 గ్రాముల వెండితో పాదుకలను స్వామికి చేయించారు. వీటికి శుక్రవారం ఆలయంలో పూజలు నిర్వహించాక ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందచేశారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

భద్రాచలం: గిరిజన నిరుద్యోగ యువత ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ యువజన శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. పదో తరగతి మొదలు డిగ్రీ, ఆపై కోర్సులు గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు ఐటీడీఏ ద్వారా నిర్వహించే శిక్షణ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రాణించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈమేరకు జాబ్‌మేళాకు 105 మందికి హాజరుకాగా మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూల ద్వారా 56 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, కంపెనీల ప్రతినిధులు రాజశేఖర్, రాంబాబు, సుహాసిని, నరేష్, గోపాల్, వైటీసీ సిబ్బంది స్వరూప, గీత, సమ్మయ్య, సంపత్ పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీకి టైర్ హ్యాండ్లర్, మొబైల్ సర్వీస్ వ్యాన్


వాహనాలను ప్రారంభిస్తున్న జీఎం రమేష్

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీకి రూ.1.46 కోట్ల విలువైన టైర్ హ్యాండ్లర్ యంత్రం, రూ.36.50 లక్షల విలువైన మొబైల్ సర్వీస్ వ్యాన్‌ను కేటాయించారు. ఆయా వాహనాలను ఏరియా జీఎం జక్కం రమేష్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. డంపర్లు, డోజర్లకు సంబంధించిన అత్యధిక బరువైన టైర్లను మార్చటం కోసం యాజమాన్యం టైర్ హ్యాండ్లింగ్ యంత్రాన్ని కేటాయించిందని తెలిపారు. తద్వారా టైర్ మార్చడం సులువై ఉత్పత్తికి అంతరాయం ఏర్పడదని చెప్పారు. మొబైల్ సర్వీస్ వ్యాన్ ద్వారా క్వారీలో నడిచే వాహనాల నిర్వహణ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ ఎస్.వెంకటాచారి, మేనేజర్ వీరయ్యతో పాటు లక్ష్మణమూర్తి, ఉపేంద్రాచారి, పూర్ణచంద్రరావు, దేవదాస్, మనోహర్ పాల్గొన్నారు.